క్లుప్తంగా

దళితుల సమస్య పరిష్కారానికి కృషి

పెద్దతిప్పసముద్రం : స్థానిక అంబేడ్కర్ కాలనీలో శనివారం అధికారులు పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఎవరైనా దళితులను కించ పరచినా, రెండు గ్లాసుల పద్ధతి అవలంబించినా, కులం పేరుతో దూషించినా కేసులు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం దళితుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చొరవ చూపుతామని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ తమక శంకర్, తహసీల్దార్ శ్రీరాములు నాయక్, ఎంపీడీఓ కేవీఎస్ బాలాజీ, ఏఎస్ఐ వెంకటస్వామి, ఆర్ఐ అనీషా,వీఆర్వో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శని త్రయోదశి పూజలు

పెద్దతిప్పసముద్రం : శ్రావణమాసం సందర్భంగా శనివారం స్థానిక శివాలయంలో శని త్రయోదశి పూజలను ఘనంగా నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి ఆలయంలో పూజలు, నవ గ్రహాలకు అభిషేకం, శనైశ్వరునికి తైలాభిషేకంతో పాటు హోమాలను నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

తరిగొండ ఆలయంలో విశేషపూజలు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం చివరి శనివారం కావడంతో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు.

గణపతి విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

కలికిరి : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక విగ్రహాలు, మండలపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి అని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో వినాయక ఉత్సవ కమిటీలు, గ్రామాల్లో ఏర్పాటు చేసే వినాయక మండపాలు, విగ్రహాలకు ముందుగా పోలీస్ స్టేషన్‌లో సమాచారమివ్వాలన్నారు. నిమజ్జనంలో కూడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రతిఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

తంబళ్లపల్లె : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించినప్పుడే ఆరోగ్యం చేకూరుతుందని కోసువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ ముని కుమార్ తెలిపారు. శనివారం ఆర్ఎస్ తండాలో వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాల బారిన పడిన వారికి వైద్య చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో పోషణ్‌పక్వాడ, రాష్ట్రీయ కిషోర్ స్వచ్ఛ కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం రమేష్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

వాల్మీకిపురం : తల్లిదండ్రులు పిల్లలను విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఆర్ఎంఎం కళ్యాణ మండపంలో అండర్ 14 క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభగల క్రీడాకారులుగా గుర్తింపు పొందిన చాలా మందికి ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయన్నారు. విద్యతోపాటు క్రీడల్లో ఎదుగుదలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు విజయ్ కుమార్‌ను పూల మాల, దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సునీల్ కుమార్, శ్రీధర్ కుమార్, శ్రీనివాసులు, గిరి, సతీష్, షాహెద్, భరత్, ఆసిఫ్, ఫయాజ్ పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కలికిరి : మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లి పేరు మీద ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా శనివారం మొక్కలు నాటారు. పట్టణంలోని ఎంఆర్‌సీ కార్యాలయ ఆవరణలోని అంగన్ వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ కరీముల్లా మొక్కలు నాటి వాటి ఆవశ్యకతను తెలిపారు. కార్యక్రమాలలో ఎంఈఓ-2 నాగార్జున, ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుంధతి, అంగన్‌వాడీ టీచర్‌లు, ఆయాలు, ప్రజలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతికి నివాళి

పెద్దమండ్యం : మండలంలోని కోటకాడపల్లె మాజీ ఎంపీటీసీ రాధాక్రిష్ణ మృతికి పలువురు నాయకులు నివాళి అర్పించారు. అనారోగ్యంతో బాధపడుతూ రాధాకృష్ణ శనివారం మృతి చెందాడు. తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే కలిచెర్ల ప్రభాకరరెడ్డి ముఖ్య అనుచరుడిగా, వైఎస్సార్ సీపీ నాయకుడుగా, ఎంపీటీసీగా రాధాకృష్ణ ప్రజలకు సేవలందించారు. ఆయన మృతి పట్ల ఎంపీపీ గుర్రం పూర్ణచంద్రిక, మాజీ జెడ్పీటీసీ రమేష్, సర్పంచ్‌లు విశ్వనాథ, బాషా, కంటి విశ్వనాధరెడ్డి సంతాపం తెలిపారు.

శ్రావణం.. శుభప్రదం

భక్తిశ్రద్ధలతో శ్రావణ శనివారోత్సవం



రామసముద్రం : స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలో భక్తులు



రామసముద్రం: ప్రత్యేక అలంకారంలో గెవితిమ్మరాయస్వామి



మదనపల్లె : మునగకాయల అలంకారంలో కపిశ్రేష్టుడు



వాల్మీకిపురం : శనేశ్వర స్వామి మహా తైలాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

మదనపల్లె సిటీ : శ్రావణ మాసం నల్గవ శనివారం సందర్భంగా మదనపల్లె పట్టణంలోని వైష్ణవాలయాల్లో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో దేవతామూర్తులకు విశేష పంచామృతాభిషేకం అనంతరం కనుల పండువగా అలంకారం నిర్వహించారు. స్థానిక బసినికొండపై వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తులు ఉదయం నుంచి కొండకు చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక బీటీ కాలేజీ మైదానం వద్దనున్న వరాల అంజనేయస్వామి ఆలయంలో స్వామిని మునగకాయలతో అలంకరించారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

గెవితిమ్మరాయస్వామి ఆలయంలో పూజలు

రామసముద్రం : రామసముద్రం మండలంలోని దిన్నిపల్లి సమీపంలో వెలసిన శ్రీ గెవితిమ్మరాయస్వామి ఆలయంలో శ్రావణ మాసం పూజలు శనివారంతో ముగిశాయి. ఉదయం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు కులశేఖర్‌బట్టర్ ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు వైభవంగా నిర్వహించారు. ఆంధ్రా, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ రఘుపతిరెడ్డి, ఉపాధ్యక్షుడు మునస్వామి, కార్యదర్శి ఈశ్వర్, కోశాధికారి శ్రీనివాసులు, కమిటీ సభ్యులు క్యూ ఏర్పాటు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. గోవింద నామస్మరణలతో మోరుకొండ మారుమ్రోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తలనీలాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. ఆవని విజయకుమార్‌రాజు, మరి కొంత మంది పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వైభవంగా శనేశ్వరుడికి మహా తైలాభిషేకం

వాల్మీకిపురం : వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయస్వామి సమూహ దేవాలయంలో శ్రావణ శని త్రయోదశి సందర్భంగా శనివారం శనేశ్వరస్వామికి విశేష ఏకవార మహా తైలాభిషేకం నిర్వహించారు. అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శని మహాకాళ మృత్యుంజయ హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక కోనేటివీధిలోని శ్రీ లక్ష్మీ కామేశ్వర స్వామి దేవాలయంలో నవగ్రహ విగ్రహములకు తైలాభిషేకం నిరవహించి, పంచామృతాభిషేకం, మృత్యుంజయ హోమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు గోనవరపు శీనా స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా శనిత్రయోదశి వేడుకలు

గుర్రంకొండ : మండలకేంద్రమైన గుర్రంకొండలో శనిత్రయోదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రావణమాసంలో చివరి వారం కావడంతో పాటు శనిత్రయోదశి పండుగ కావడంతో పండుగ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, శ్రీసిద్ధేశ్వర స్వామిఆలయం, శ్రీకోట విఘ్నేశ్వరాంజినేయ స్వామి ఆలయాల్లో వేకువజామునే స్వామివార్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. రంగురంగుల పుష్పాలతో పాటు తమలపాకుల హారాలతో భక్తులు మొక్కులు చెల్లించుకొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి

కలికిరి : ర్యాగింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి హెచ్చరించారు. ర్యాగింగ్‌కు భయపడి మెకానిక్ రెండవ సంవత్సర విద్యార్థి ఆత్మహత్య చేసుకొన్న ఘటనతో జేఎన్టీయూ ఆడిటోరియంలో విద్యార్థిని, విద్యార్థులకు వేర్వేరుగా ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భారతీయ న్యాయ సన్హిత (బిఎన్ఎస్) చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, తోటి విద్యార్థుల పట్ల సోదరభావంతో మెలగాలన్నారు. విద్యార్థులు చదువు, మానసిక, శారీరక వికాసానికి ఆటలు తప్ప ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలని సూచించారు. ర్యాగింగ్ కిందికి వచ్చే చర్యలపై విద్యార్థులకు తెలిపారు. ఇకపై ప్రతి 15 రోజులకు కళాశాల ర్యాగింగ్ కమిటీ సమావేశమవుతుందని, ర్యాగింగ్‌కు పాల్పడినట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలుంటాయన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడి ఇతరులను హింసించి భవిష్యత్తును అంధకారం చేసుకోకూడదన్నారు. ఎవరైనా ర్యాగింగ్ పేరుతో ఏడిపిస్తే కళాశాల ర్యాగింగ్ కమిటీకి గానీ, పోలీసులకు గానీ ఫిర్యాదు చేయాలని చెప్పారు. జెఎన్టీయూ విద్యార్థులు కళాశాల నుంచి బయటకు రావాలంటే తప్పనిసరిగా సంబంధిత హెచ్ఓడీ అనుమతి తీసుకోవాలని, రాత్రి 8 గంటల పైన బయట తిరగకూడదని హెచ్చరించారు. ఆపై కనపడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం

డీవైఈఓ శ్రీరామపురుషోత్తం



తమ్మిరెడ్డిగారి హృషికేష్‌ను సన్మానిస్తున్న దృశ్యం

మదనపల్లె : ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శమని డీవైఈఓ శ్రీరామపురుషోత్తం అన్నారు. మండలంలోని సీటీఎం జెడ్పీహైస్కూల్ గణిత ఉపాధ్యాయులు తమ్మిరెడ్డిగారి హృషికేష్ ఉద్యోగ విరమణ అభినందన సభను శనివారం స్థానిక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఈఓ శ్రీరామపురుషోత్తం, సహ ఉపాధ్యాయులు, అతిథులు తమ్మిరెడ్డిగారి హృషికేష్, ఎన్.నాగమణి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ...తమ్మిరెడ్డిగారి హృషికేష్‌ను తోటి ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందన్నారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని, గణిత ఉపాధ్యాయులుగా, హెడ్మాస్టర్‌గా పాఠశాల, విద్యార్థుల అభివృద్ధికి హృషికేశ్ సేవలు అభినందనీయమన్నారు. తమ్మిరెడ్డిగారి హృషికేష్ మాట్లాడుతూ 36 సంవత్సరాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితం తనకెంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఉపాధ్యాయ వృత్తిలోని గొప్పదనం మరువలేనిదన్నారు. విధి నిర్వహణలో తనకు ఎంతో సహకరించిన తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో టి.ప్రమీలాదేవి, గీతిక, డాక్టర్.టి.లహరి, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఎంసీ చైర్మన్‌గా గడ్డం అమరనాథ



పెద్దమండ్యం : స్థానిక మోడల్ పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా గడ్డం అమరనాథయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ఎన్నిక శనివారం నిర్వహించారు. రెండుసార్లు వాయిదా పడగా ఎన్నికల నిర్వహణ కోసం మూడవసారి అధికారులు ఏర్పాట్లు చేశారు. బి కొత్తకోట సీఐ రాజారెడ్డి, తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డిలు పాఠశాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులను తల్లిదండ్రుల మాత్రమే పాఠశాలలోకి అనుమతినిచ్చారు. తరగతుల వారీగా విద్యార్థుల తల్లిదండ్రుల్లో కమిటీ సభ్యుల ఎన్నిక చేపట్టారు. ఐదు తరగతులకు 15 కమిటి సభ్యులు ఎన్నిక కాగానే చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎంపిక పూర్తి చేశారు. వైస్ చైర్మన్‌గా కె. రేష్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇదిలా ఉండగా మండలంలోని యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాలలో కమిటీ ఎన్నిక మూడవసారి వాయిదా పడింది.

కౌన్సిల్ మీట్ నిర్వహించకపోవడంపై సందేహాలు

- అధికారుల ట్రాన్స్‌ఫర్స్ కారణంగా అన్న కమిషనర్
- ఎమ్మెల్యే అందుబాటులో లేనందునే అంటున్న సభ్యులు
- గౌరవవేతనం కోల్పోయిన కౌన్సిలర్లు

మదనపల్లె : ప్రతినెలా క్రమం తప్పకుండా నిర్వహించాల్సిన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఆగస్టులో జరపకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు ట్రాన్స్‌ఫర్ హడావిడిలో ఉండటంతో సమావేశం నిర్వహించలేక పోయామని మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల తెలిపితే....ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అందుబాటులో లేకపోవడంతోనే సమావేశం రద్దుచేశారని కౌన్సిల్ సభ్యులు మాట్లాడుకుంటున్నారు. మదనపల్లె మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీకి పూర్తి ఆధిక్యం ఉంది. పట్టణంలోని 35 వార్డుల్లో 33వార్డుల్లో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు ఉండగా, రెండువార్డుల్లో టీడీపీ కౌన్సిలర్లు ఉన్నారు. అందులో ఒకరు రాజీనామా చేయడంతో కేవలం ఒకే ఒక కౌన్సిలర్ మిగిలారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించేందుకు చైర్‌పర్సన్, సభ్యులు అందుబాటులో ఉన్నప్పటికీ, మీటింగ్ నిర్వహించకపోవడంపై పలు సందేహాలు తలెత్తుతున్నాయి. సమావేశానికి మూడురోజుల ముందు ఎజెండా రూపొందించి మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిల్ సభ్యులకు, ఎక్స్ అఫిషియో మెంబర్లు, కో-ఆప్షన్ మెంబర్లు సమాచారం అందించి నిర్వహించడం రెగ్యులర్‌గా జరిగే కార్యక్రమం. అయితే ఎజెండా రూపకల్పనకు ముందు ఏఏ అంశాలు ప్రతిపాదిస్తున్నారో వాటికి సంబంధించి ఎమ్మెల్యే అనుమతి తీసుకున్నాకే ఎజెండాను తయారుచేసి సమావేశం నిర్వహించడం మూడునెలలుగా జరుగుతోంది. ఆగస్టులో కౌన్సిల్ మీట్ నిర్వహించాలని అధికారులు అనుకుని ఉంటే 25న అజెండా రూపొందించి, 28, 29 వతేదీల్లో జరిపి ఉండవచ్చు. 27 నుంచి 30వతేదీ వరకు నాలుగురోజుల పాటు ఎమ్మెల్యే అందుబాటులో లేకపోవడం, ఆయన అనుమతి లేకుండా ఎజెండా రూపొందిస్తే ఎక్కడ మాట పడాల్సి వస్తుందోనని ఎజెండా రూపొందించలేదనే విషయం అర్థమవుతోంది. ఈ విషయమై కమిషనర్ కే.ప్రమీల వివరణ ఇస్తూ...మున్సిపాలిటీలో ఉద్యోగులు ట్రాన్స్‌ఫర్స్ కారణంగా అందుబాటులో లేకపోవడం, 31న పెన్షన్ పంపిణీ చేయాల్సి ఉండటంతో ఆగస్టు కౌన్సిల్ మీట్ రద్దుచేశామన్నారు. సెప్టెంబర్ మొదటివారంలో నిర్వహిస్తామన్నారు. అయితే ఆగస్టులో మున్సిపల్ సమావేశం నిర్వహించనందున కౌన్సిల్ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్లు మున్సిపాలిటీ నుంచి పొందే గౌరవవేతనాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ

మదనపల్లె : ఎన్‌టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను శనివారం ఎమ్మెల్యే షాజహాన్‌బాషా నియోజక వర్గ వ్యాప్తంగా పలుచోట్ల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సెప్టెంబర్ మాసానికి సంబంధించిన పింఛన్లు ఒకరోజు ముందుగానే పంపిణీ చేశామన్నారు. సెప్టెంబర్ 1 ఆదివారం కావడం, ఆ రోజు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవుదినం కావడంతో ఉద్యోగుల సెలవుకు భంగం కలగకుండా, పెన్షన్‌దారులకు ఆ రోజు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, ఎంపీడీఓ భానుప్రసాద్, మాజీ కౌన్సిలర్ నీలకంఠ, రామకృష్ణాచారి తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లె మున్సిపాలిటీ టాప్..

నియోజకవర్గ వ్యాప్తంగా జరిగిన పెన్షన్ పంపిణీలో సాయంత్రం 6 గంటలకు 11,016 పెన్షన్లకు 10,742 మందికి పంపిణీ జరిగి 97.51 శాతంతో ప్రథమస్థానంలో నిలిచింది. మదనపల్లె మండలంలో మొత్తం 14,167 పెన్షన్లకుగాను సాయంత్రం 6గంటలకు 13,725 మందికి పంపిణీ చేసి 96.88 శాతం నమోదైంది. రామసముద్రం మండలంలో 6,490 పెన్షన్లకు 6,262 పెన్షన్లు పంపిణీ చేసి 96.49 శాతం నమోదైంది. నిమ్మనపల్లె మండలంలో 5,110 పెన్షన్లకు 4,913 మందికి పంపిణీ జరిగి 96.14 శాతం నమోదైంది.

పింఛన్ల పంపిణీ

కేవీపల్లె : మండలంలో శనివారం 96.19 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ యాదవేంద్ర, ఈవోపీఆర్‌డీ గఫూర్ తెలిపారు. సెప్టెంబర్ ఒకటి ఆదివారం కావడంతో శనివారం మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం మండలంలో 6946 మందికి పంపిణీ చేయడం లక్ష్యంగా కాగా 6677 మందికి పంపిణీ చేశారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరు : ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ భీమేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని వేపులబైలులో మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫారసు మేరకు ప్రతి నెలా చివరి తేదీన సివిల్ రైట్స్ డే నిర్వహించి ఎస్సీ, ఎస్టీ ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. గ్రామాల్లో అసమానతలు, వివక్షతను తొలగించడానికి సమావేశాలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఏపీఎం లక్ష్మణ్‌రెడ్డి, ఏఎస్ఐ హేమసుందరం, ఇరిగేషన్ ఏఈ ఎత్తిరాజులు, ఆర్ఐ చాణిక్య, జూనియర్ అసిస్టెంట్ రెడ్డెప్ప, నాయకులు పాలకుంట శ్రీనివాసులు, ధణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సివిల్ రైట్స్ డే

రామసముద్రం : సమస్యల పరిష్కారానికే సివిల్ రైట్స్ డే నిర్వహిస్తున్నట్లు డీటీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మూగవాడి హరిజనవాడలో సివిల్ రైట్స్ డే సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరిజనవాడలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఇందులో భాగంగాక మ్యూనిటీ భవనం మరమ్మతులు చేయడం లేదా నూతన భవనం నిర్మించాలన్నారు. అలాగే ఎర్రప్పల్లి రోడ్డు నుంచి హరిజనవాడకు వచ్చే రోడ్డు అధ్వానంగా ఉందని సూచించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుధాకర్‌రెడ్డి, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో రఘునాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సదుపాయాలు కల్పించాలి

నిమ్మనపల్లె : ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించేలా అధికారులు కృషి చేయాలని దళితసంఘాల నాయకులు కోరారు. శనివారం ముష్టూరు పంచాయతీ గౌనివారిపల్లెలో తహసీల్దార్ ధనుంజయులు ఆధ్వర్యంలో సివిల్ రైట్స్‌డే నిర్వహించారు. స్థానికులు తాము ఎదుర్కోంటున్న సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎస్సీ,ఎస్టీ ప్రజలకు వారి కోసం రాజ్యాంగం కల్పించిన చట్టాలు, హక్కులు అవగాహన కల్పించేందుకు సివిల్ రైట్స్‌డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి నెలా ఎస్సీ,ఎస్టీల నివాస ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ఎస్.ఐ తిప్పేస్వామి, ఎంపిడిఓ రమేష్‌బాబు,ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు రెడ్డినారాయణ, సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్, విఆర్‌ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛత.. సమాజంపై బాధ్యత

నేటి నుంచి 15 వరకు 'స్వచ్ఛ పక్వాడ'

మదనపల్లె సిటీ : ప్రస్తుత వర్షాకాలంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి వ్యాధులు ప్రబలుతున్నాయి. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం ద్వారా అనారోగ్యం దరిచేరకుండా చూసుకోవచ్చు. ఈ విషయాలపై విద్యార్థుల్లో అవగాహన పెంచాలనే లక్ష్యంతో విద్యాశాఖ స్వచ్ఛతా పక్షోత్సవాలు (స్వచ్ఛ పక్వాడ) నిర్వహించనుంది. సెప్టెంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థులకు సమాజం పట్ల బాధ్యత, స్వచ్ఛతపై అవగాహన కల్పించడం, వారిలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించేలా కార్యాచరణ రూపొందించారు. ఈ మేరకు ఇప్పటికే జిల్లాలోని విద్యాశాఖాధికారులు ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సమాచారం ఇచ్చారు.

కార్యక్రమాలు ఇలా..

వ్యక్తిగత పరిసరాల పరిశుభ్రతపై అందరిలోనూ అవగాహన కలిగించడం, సమాజ భాగస్వామ్యం పెంచడం, మొక్కలను నాటించి హరిత చైతన్యాన్ని కలిగించడం అనే ప్రధాన అంశాలుగా ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నారు. జూనియర్, సీనియర్ విభాగాల్లో పాఠశాల స్థాయి పోటీలు ఉంటాయి.

తేదీల వారీగా కార్యక్రమాలు ఇలా:

- 1న ఉపాధ్యాయులు, విద్యార్థులతో స్వచ్ఛతా శపథం.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు (ఫైల్)

- 2,3 తేదీల్లో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన.
- 4,5 తేదీల్లో స్థానిక ప్రజలతో విద్యార్థులు మమేకం కావడం, వారికి స్వచ్ఛత గురించి తెలియజెప్పడం.
- 6వతేదీ హరిత దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో మొక్కలు నాటడం.
- 7,8 తేదీల్లో స్వచ్ఛతా భాగస్వామ్యంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ తదితర పోటీల నిర్వహణ.
- 9,10 తేదీల్లో చేతుల ప్రాముఖ్యాన్ని వివరించడం, తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకునేలా చూడటం.
- 11వతేదీ వ్యక్తిగత పరిశుభ్రత దినోత్సవం.
- 12వతేదీ సమాజంలో విద్యార్థిని భాగస్వామ్యం చేయడం.
- 13,14 తేదీల్లో స్వచ్ఛతపై ప్రణాళికను విద్యార్థులతో సిద్ధం చేయించడం.
- 15వతేదీ పక్షోత్సవాలు, వివిధ పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులక బహుమతులు అందించి ప్రోత్సహించడం.

అన్ని చోట్ల అమలయ్యేలా చర్యలు



ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలలో స్వచ్ఛత పక్వాడ నిర్వహించాలి. విద్యార్థులకు, సమాజానికి పరిశుభ్రతపై అవగాహన కలిగించాలనే ఉద్దేశంతో కార్యక్రమం అమలు చేయాలని ఆదేశాలు వచ్చాయి. తప్పనిసరిగా అన్ని చోట్ల అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

– శ్రీరాం పురుషోత్తం, డీవైఈఓ, మదనపల్లె

టీ20 క్రికెట్‌కు రామసముద్రం విద్యార్థి



జునైద్

రామసముద్రం : రామసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఈసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్. జునైద్ ఆంధ్ర టీ20 క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తరపున ఆడి గెలిచినందుకు నేపాల్‌లో ఆడేందుకు అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ చిట్టిబాబు శనివారం తెలిపారు. సెప్టెంబర్ 18 నుంచి 22 వరకు నేపాల్‌లో జరిగే టీ20 లో పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు విద్యార్థిని అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

గుర్రంకొండ : లారీ, బొలెరో వాహనం ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో చోటు చేసుకుంది. శనివారం బెంగళూరు నుంచి రాయచోటివైపు వెళుతున్న సిమెంటు లారీ గుర్రంకొండ నుంచి తంబళ్లపల్లెకు వెళుతున్న బొలెరో వాహనం మార్గమధ్యంలో గుర్రంకొండకు సమీపంలోని ఓ డాబా వద్ద ఢీకొన్నాయి. ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న తంబళ్లపల్లె మండలానికి చెందిన ఎం. రమణ (47), ఎం. చంద్రకళ(38) తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల్ని చికిత్స నిమిత్తం108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు.

జూదరుల అరెస్ట్

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో తొమ్మిది మంది జూదరులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న పొలాల్లో శనివారం జూదం నిర్వహిస్తున్నారనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.20, 600 నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ మధురామచంద్రుడు తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

నాగవేలు జీవితం ఆదర్శం

బి.కొత్తకోట : స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నాగవేలు జీవితం విద్యార్థులకు ఆదర్శమని ఎంఈఓ రెడ్డిశేఖర్ అన్నారు. శనివారం ఆయన ఉద్యోగవిరమణ కార్యక్రమం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ...నాలుగు దశాబ్దాల విధి నిర్వహణలో ఎవరినీ నొప్పించకుండా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి నాగవేలు చేసిన కృషిని నూతన ప్రిన్సిపాల్ వాసుదేవరావు కొనియాడారు. అనంతరం నాగవేలును ఘనంగా సత్కరించారు.

పర్యావరణాన్ని కాపాడుదాం

వాల్మీకిపురం : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని వాల్మీకిపురం సీడీపీఓ భారతి అన్నారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మ పేరు మీద ఒక్క చెట్టు – మన రేపటి కోసం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్వైజర్ రోహిణి కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

పెద్దమండ్యం : స్థానిక పోలీస్ స్టేషన్‌ను మదనపల్లె డీఎస్పీ కొండయ్యానాయుడు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేసుల నమోదు, వాటి పురోగతిపై సిబ్బందితో సమీక్షించారు. స్థానిక విలేకరులతో డీఎస్పీ మాట్లాడుతూ వినాయకచవితి పండుగ సందర్భంగా ఎక్కడైనా రోడ్లపై బలవంతపు చందాలు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే విగ్రహాలు ఏర్పాటు చేసే వారు స్టేషన్‌లో ముందుగా సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఇంటివద్దకే తపాలాసేవలు

పీలేరు రూరల్ : ఇంటి వద్దకే పలు రకాల తపాలా సేవలు అందిస్తున్నట్లు తపాలా శాఖ ఇన్స్‌పెక్టర్ జి. వినోద్‌కుమార్ అన్నారు. శనివారం పీలేరు పట్టణంలోని సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, రత్నం పాఠశాల, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో వ్యక్తిగత ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోవాలని అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాల వారికి ఏడాదికి రూ. 549 చెల్లిస్తే రూ. 10 లక్షలు, రూ. 749 చెల్లిస్తే రూ. 15 లక్షలు ప్రమాద బీమా పొంద వచ్చునని తెలిపారు. మహిళలకు సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.